www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 మార్చి 2024
5
వైఎస్ఆర్



బహుముఖ ప్రతిభామూర్తి కోడూరు ప్రభాకరరెడ్డి

కడప అర్బన్ : బహుముఖ ప్రతిభామూరి కోడూరు ప్రభాకరరెడ్డి అని విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 130వ సదస్సు నిర్వహించారు. కార్యక్ర మంలో 'డాక్టర్ కోడూరు ప్రభాకర రెడ్డి జీవితం - సాహిత్యం' అనే అంశంపై ప్రముఖ ప్రవచనకర్త, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ దీవి హయ గ్రీవాచార్యులు ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో డాక్టర్ కోడూరు ప్రభా కరరెడ్డి బహుముఖ రచనా వైశిష్ట్యాన్ని విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్ర మం చివరలో వక్త డాక్టర్ దీవి హయగ్రీ వాచార్యులును, ప్రముకులు సత్కరిం చారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెం కటరమణ, గానుగపెంట హనుమంతరావు, కొత్తపల్లి రామాంజనేయులు, రాజారెడ్డి, రవికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేను లోకల్!

కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో నాన్‌లోకల్..లోకల్, నాన్(డీ) మెరిట్..మెరిట్, ఓపెన్ కేటగిరీ...రిజర్వేషన్.. సర్వీస్ మార్కులు కలపడం, సర్టిఫికెట్ల లాగ్వేజ్ మార్కులు ఒకరికి కలపడం. మరొకరికి కలకపోవడం వంటి విన్యాసాల పరంపర కొనసాగుతోంది. దీనిపై పలువురు అర్హులైన అభ్యర్థులు జిఎంసి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటి విన్యాసాల నేపథ్యంలో జిఎంసి అధికార యంత్రాంగం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుండడం ఆందోళన కలిగి స్తోంది. దీనిపై స్పందించాల్సిన కలెక్టర్ చోద్యం చూస్తుండడం నిరుద్యోగ లోకం నివ్వెరపోతోంది.

- రివైజ్డ్ ఫైనల్ లిస్టులో నాన్‌లోకల్..లోకలే
- కాంపొనెంట్ పదం లేదనే సాకుతో టెక్నీషియన్‌కు మొండిచేయి
- సర్వీస్ మార్కులు లేవనే పేరుతో ఓ థెరపిస్ట్‌కు నిరాకరణ
- అవకతవకలకు కేరాఫ్ ఆ ముగ్గురే?
- నిద్రావస్థలో జిఎంసి యంత్రాంగం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకల పర్వం కొనసాగుతూనే ఉంది. 2023 డిసెంబర్‌లో జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, కేన్సర్ కేర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల యంత్రాంగం పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా మొదట రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలక్షన్ లిస్టు ప్రకటించడంపై ఆందోళన నెలకొనడం, రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతలు నిర్ధారించడంలో విఫలం కావడంతో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డిప్యూటీ సిఎం స్పందించడంతో కలెక్టర్ మరోసారి సర్టిఫికెట్ల పరిశీలన, రిజర్వేషన్ అర్హతల నిర్ధారణకు పలువురు జిల్లా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులోనూ కేన్సర్ కేర్ విభాగానికి సంబంధించిన రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇద్దరు స్థానిక జిజిహెచ్‌లోని బ్లడ్‌బ్యాంకు సహచర ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మెరిట్ మార్కులు కలిగిన అభ్యర్థికి డిఎంహెచ్ఓ ఇచ్చిన సర్టిఫికెట్‌లో కాంపొనెంట్ అనే పదం లేదనే పేరుతో నిరాకరించడం గమనార్హం. ఇందులో తక్కువ మార్కులు కలిగిన ఓ రిజర్వేషన్ కేటగిరీకి చెందిన ఓ ఉద్యోగిని ఓపెన్ కేటగిరీలో సెలెక్షన్ లిస్టుకు ఎంపిక చేశారు. ఎస్‌సి కేటగిరీ పోస్టును వేకెంట్‌గా చూపించడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో స్థానిక జిజిహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్ట్‌కు సర్వీస్ మార్కులు కలపకుండా సెలెక్షన్ లిస్టులో మొండి చేయి చూపించడం గమనార్హం. ఇంతటితో ఆగకుండా పులివెందుల మెడికల్ కళాశాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు నాన్‌లోకల్ కేటగిరీ అయితే లోకల్ కేటగిరీ కింద ఎంపిక చేసినట్లు సమాచారం. దీంతో సదరు యువకుడు తేరుకుని సర్టిఫికెట్లు అందజేయడానికి ఆలస్యంగా జిఎంసి చుట్టూ చక్కర్లు కొడుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. కలెక్టర్ నియమించిన జిల్లా ఉన్నతాధికారుల బృందం సర్టిఫికెట్లు వెర్ఫికేషన్, రిజర్వేషన్ తదితర అంశాల ఆధారంగా పరిశీలించి రివైజ్డ్ ఫైనల్ లిస్టులోనూ అవకతవకలు కొనసాగడం విస్మయాన్ని కలిగిస్తోంది.

ఆ ముగ్గురితోనే అవకతవకలు?

కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో ఫైనల్ లిస్టులో ఓ ల్యాబ్ టెక్నీషి యన్, సూపరింటెండెంట్ సహా మరో ఉద్యోగి కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులోని ఓ ల్యాబ్ టెక్నీషియన్ బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ పోస్టుకు మార్కులను ఒకరికి కలపడం, మరొకరికి కలపకపోవడం, రిజర్వేషన్ కేటగిరీలను సైతం మార్చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎస్‌సి కేటగిరీ అభ్యర్థికి ఓసి కేటగిరీ పోస్టుకు ఎంపిక చేయడం, ఎస్‌సి కేటగిరీ పోస్టును వేకెంట్‌గా చూపించ డమేమిటనే విమర్శ వినిపి స్తోంది. వీరికి జిఎంసి ప్రిన్సిపాల్ వంత పాడటం విస్మయాన్ని కలిగిస్తోంది.

గ్రీవెన్స్‌ను అడ్రెస్ చేయండి

కాంట్రాక్టు పోస్టుల భర్తీలో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న గ్రీవెన్స్‌ను పరిష్కరించిన తరువాత సెలెక్షన్ లిస్టు పెట్టాలి. కేన్సర్‌కేర్ విభాగంలోని ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టు దరఖాస్తుదారుకు డిఎంహెచ్ఓ జారీ చేసిన సర్టి ఫికెట్‌లో కాంప్లెక్స్ అనే పదం లేదనే పేరుతో నిరాకరించడం దారుణం. తాజాగా డిఎంహెచ్ఓ ఇచ్చిన సర్టిఫికెట్ అర్థమైనదైతే పరిశీలించాలి. సదరు వేకెంట్ పోస్టును భర్తీ చేయాలి. సర్వీసు మార్కులు కలపకుండానే జిజిహెచ్‌కు చెందిన ఓ ఫిజియోథెరపిస్ట్‌కు మొండిచేయి చూపించడం తగదు.

-బి.మనోహర్, జిజిహెచ్ మెడికల్ యూనియన్ నాయకులు, కడప.

మాధవరం 'ఆత్మహత్య'లపై విచారణకు ఆదేశించాలి

- కారకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- తహశీల్దార్, ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలి
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ డిమాండ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎం.ఎ. గఫూర్, నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ ఒంటిమిట్ట

కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం చేనేత కుటుంబ ఆత్మహత్య ఘటన కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్ర శేఖర్ బృందంతో కలిసి మాధవరంలో శనివారం ఆత్మహత్యకు పాల్ప డిన సుబ్బారావు కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఆత్మ హత్యకు దారి తీసిన కారణాలను మృతుని కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబీకుల దగ్గర ఉన్న పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఇతర ఆధారాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 2015లో ఒంటిమిట్ట పొలం పరిధిలోని సర్వే నెంబర్ 218.2, ఖాతా నెంబర్ 1712లో 2.10 ఎకరాల పొలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గ వైసిపి నేతల అనుచరులు అప్పటి తహశీల్దార్, ఆర్డీఓల సహకారంతో సుమారు 600 ఎకరాలపైగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు తొలగించి అన ర్హుల పేర్లతో ఎక్కించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఇందులోని నిజానిజాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో చోటుచేసుకున్న భూకబ్జాతో నిండు కుటుంబం బలి కావడంపై స్పందించాల్సిన అవ సరం ఉందన్నారు. కుటుంబ సభ్యుల ఆత్మహత్యలపై సమగ్ర విచా రణ చేపట్టి, బాధ్యులైన అధికారులు, సొంత పార్టీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో చోటుచేసుకునే ఇటువంటి దురాగతాలకు వైసిపి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. **అండగా ఉంటాం :** మాధవరం ఆత్మహత్య కుటుంబ సభ్యులకు ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. మీ తరుపున సిపిఎం పోరాటం చేస్తుందని, సాధ్యమైన మేరకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇందులోభాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌ను కోరతామన్నారు. మీ పొలం మీకు దక్కేలా ప్రయత్నించడంతోపాటు బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం తక్షణమే అందజేయాలని కోరతా మని తెలిపారు. ఆత్మహత్యలకు దారి తీసిన ఘటనకు గల కారణా లను పరిశీలన అనంతరం పిఎం కిసాన్ నిధులు జమ దగ్గర నుంచి మీ కుటుంబ అప్పుల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మో హన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, ఒంటిమిట్ట, సిద్ధ వటం మండల కార్యదర్శులు కోనేటి నరసయ్య సురేష్‌బాబు పాల్గొన్నారు.

అప్పుల వల్లే ఆత్మహత్య : డిఎస్‌పి

పాల సుబ్బా రావు, భార్య, కుమార్తె అప్పుల బాధతోనే ఆత్మ హత్యకు పాల్పడ్డారని కడప డిఎస్‌పి ఎం.డి. షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన రిపోర్టు ప్రకారం మృతులు మత్తుమందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. పైగా మృతుడుపాల సుబ్బా రావుకు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో సంబంధాలున్నాయని, అప్పుల బాధ తటుకోలేక మాన సికంగా కుంగి ఆత్మ హత్యలకు పాల్పడినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆర్‌డిఒతో మాట్లాడితే పాల సుబ్బారావు భూమిని ఎవరికీ పట్టా ఇవ్వలేదని సమాధానమిచ్చారని చెప్పారు.



మాట్లాడుతున్న కడప డిఎస్‌పి

వందశాతం న్యాయం చేస్తాం : జడ్‌పి చైర్మన్

బాధిత కుటుంబానికి వందశాతం న్యాయం చేస్తామని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. కుటుంబంలో పెద్ద కుమార్తెకు ఉద్యోగం కల్పిస్తామని, ఏ భూమికోసం ఆత్మహత్య చేసుకున్నా అదే భూమిని బాధిత కుటుంబానికి పట్టా రూపంలో ఇప్పించే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్

రూ. 50 వేల ఆర్థిక సాయం : టిడిపి

పాల సుబ్బారావు కుటుంబానికి రాజంపేట టిడిపి నాయకులు బత్యాల చెంగల రాయుడు పార్టీ తరుపున రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని సుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మిప్రసన్నకు భరోసా ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో భూ కబ్జాలు అధికమయ్యాయని, పేద కుటుంబాలతో చెలగాటమాడుతోందని వాపోయారు. టిడిపి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తామని పేర్కొన్నారు.



లక్ష్మీప్రసన్నను పరామర్శిస్తున్న బత్యాల

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం : సిపిఐ

బాధిత కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని సిపిఐ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం మృతుల కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు

అన్ని విధాలా ఆదుకుంటాం : జనసేన

మృతుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాజంపేట జనసేన నాయకులు అతికారి దినేష్ పేర్కొన్నారు. పాలసుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మి ప్రసన్నకు రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి ఆమెను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మతతత్వ బిజెపి ఓటమికి లౌకిక శక్తులు ఏకం కావాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి- కడప అర్బన్

మతతత్వ బిజెపి ఓటమికి దేశంలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం. ఎ. గఫూర్ తెలిపారు. ఆదివారం సిపిఎం జిల్లా విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఇవాళ ఎంతైనా ఉందని తెలిపారు. ఎన్నికల బాండ్ల వ్యవహారం ఇంతకాలం ఎందుకు దాచిపెట్టారన్నది ఇప్పుడు అర్థమవుతోందని చెప్పారు. తక్షణమే బాండ్ల భాగోతంపై దేశ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీలాండరింగ్ సహా సకల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయని అన్నారు. ఆధారాలతో పక్కాగా బయటపడిన అతి పెద్ద కుంభకోణం ఇదే అన్నారు. బిజెపి, కాంగ్రెస్, టిఎంసిలేకాదు.. వైసిపి, టిడిపి, జనసేన కూడా ఈ బాండ్ల ద్వారా లబ్ది పొందాయని తెలిపారు. బాండ్ల రూపంలో బ్లాక్ మనీ వైట్ గా మార్చుకోవడానికి సహకరించాయని పేర్కొన్నారు. అక్రమ మార్గంలో దందాకు సహకరించాయని, అధికారం అడ్డుపెట్టుకుని మళ్లీ కార్పొరేట్లకు మేలుచేసేలా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. కార్పొరేట్ల నుంచి ఎన్నికల బాండ్ల పేరుతో రహస్యంగా నిధులు తీసుకోవడం, తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వారి ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడమే పనిగా ఈ పార్టీలు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ అవినీతి మాయాజాలంలో పడని కమ్యూనిస్టుల ప్రత్యేకత మరోసారి ఈ వ్యవహారం చాటుతుందని చెప్పారు. ప్రజల పక్షాన నిలిచే నిజమైన ప్రత్యామ్నాయ శక్తిగా సిపిఎం సత్తా రుజువవుతోందని అన్నారు. కేరళ సహా వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు గానీ, తర్వాత గానీ ఎన్నడూ అలాంటి అవినీతి మకిలం తమకు అంటకుండా కాపాడుకున్న మార్క్సిస్టుల విశిష్టత బయటపడిందని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజ్యాంగ హక్కుల కోసం మతతత్వ బిజెపి ఓటమి కోసం లౌకిక ప్రజాశక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్, శివకుమార్, ఐ.ఎన్. సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, సత్యనారాయణ చారి, తో ప విద్యార్థి యువజన సంఘాల నాయకులు శివకుమార్, సునీల్, రాజేంద్ర, తోపాటు వివిధ మండలాల పార్టీ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజంపేట బిజెపి ఎంపీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా వై.భాస్కర్‌రావు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజంపేట పార్లమెంట్ బరిలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నిలవనున్నారు. ఆదివారం రాత్రి బిజెపి ఐదో విడత విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. నెల రోజులుగా సాగిన ఊహా గానాలకు తెరపడింది. రాజంపేట పార్ల మెంట్ వివరాలను పరిశీలిస్తే 20 14లో రాజంపేట పార్లమెంట్ బరిలో బిజెపి తరుపున ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పోటీ చేసి ఓడిపోయిన సంగ తి తెలిసిందే. ఇటువంటి అనుభవాల నేపథ్యంలో రాజంపేట వైసిపి పార్ల మెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని బలంగా ఢీకొనడంలో భాగంగా సుదీర్ఘంగా అన్వేషించినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా ప్రతిపక్ష, అధికార పక్ష నాయకులతో సత్సంబంధాలు, బంధుత్వాలు, స్థానికత్వం, సామా జిక, ఆర్థిక, అంగబలాల ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



కిరణ్‌కుమార్‌రెడ్డి యనమల భాస్కర్‌రావు

జనసేన అసెంబ్లీ అభ్యర్థిగా భాస్కర్‌రావు

అన్నమయ్య జిల్లా పరిధిలోని రైల్వేకోడూరు జనసేన అసెంబ్లీ అభ్యర్థిగా యనమల భాస్కర్‌రావు పేరును ప్రకటించింది. ఎస్‌సి రిజర్వ్ నియోజకవర్గం కావడంతో సుదీర్ఘ అన్వేషణ సాగించినట్లు తెలు స్తోంది. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు నియోజకవర్గ టికెట్ జన సేన దక్కడం గమనార్హం. దీంతో టిడిపి తరుపున టికెట్ ఆశా వహు లకు తీవ్ర నిరాశను కలిగించింది. 2009 నుంచి 2024 సార్వ త్రిక ఎన్నికల వరకు అప్రతిహత విజయాలు సాధిస్తున్న వైసిపి అభ్యర్థిగా ఢీకొట్టడంలో భాగంగా టిడిపి, బిజెపి, జనసేన కూటమి తరుపున యనమల భాస్కర్‌రావు పేరును ప్రకటించినట్లు తెలుస్తోంది. ఊహిం చని పేరును తెరపైకి రావడంతో తుదిపోరుకు తెరలేచినట్లు తెలుస్తోంది.

రాష్ట్రాన్ని మాఫియా ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్ : పిసిసి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రాన్ని మాఫియా ఆంధ్రప్రదేశ్‌గా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మార్చారని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి పేర్కొన్నారు. 2024 జరగబోవు ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకపక్షమైన వైసీపీని, ప్రతిపక్షమైన టిడిపి పార్టీలను, అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో ల్యాండ్, ఇసుక, మద్యం, మైనింగ్, ఎర్రచందనం, గంజాయి, డ్రగ్స్ మాఫియా రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉత్తరాంధ్రాలోని అరకు ప్రాంతం టీ తోటలకు ప్రత్యేకత కలిగి ఉండేదని కానీ ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో గంజాయికి దేశంలోనే పేరుగాంచిన ప్రదేశంగా మారిందని విమర్శించారు. గంజాయి వాడకం రాష్ట్రంలో ఏ స్థాయికి వచ్చిందంటే ఒకప్పుడు పెద్దలు మాత్రమే వాడే గంజాయిని ప్రస్తుతం హై స్కూల్, కళాశాల విద్యార్థులు కూడా విపరీతంగా వాడుతున్నారన్నారు. ల్యాండ్ మాఫియా ఏ స్థాయికి చేరిందంటే వైసిపి నాయకుల భూదాహానికి ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కుటుంబం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి నాయకులకు ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు గమనించి బిజెపి బానిస పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన లను రాబోవు ఎన్నికల్లో చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని తులసి రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. **28న వైఎస్ షర్మిల కడపకు రాక..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఈనెల 28వ తేదీన సాయంత్రం 6 గంటలకు కడప నగరంలోని పెద్ద దర్గా సమీపంలో ఉన్న అమీన్ ఫంక్షన్ ప్యాలెస్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో పాల్గొ ంటున్నట్లు తులసి రెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, పిసిసి ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, పిసిసి డెలిగేట్ పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆసిఫ్ అలీ ఖాన్, మోపూరు వెంకటరమణారెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున రెడ్డి, మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి, మహబూబ్ బాషా (మాస్), బాలం సుబ్బరాయుడు, సయ్యద్ గౌస్ పీర్, వేమా నాగరాజు, సమీరా, అమర్, ఉత్తన్న ,వినయ్ పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు..** కడప నగరం 46వ డివిజన్ లో పీస్ స్కూల్ అధినేత, అంతర్జాతీయ అవార్డు గ్రహీత సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్. తులసి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా డివిజన్ ప్రజలు చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కడపను మోడల్ నగరంగా అభివృద్ధి చేస్తాం : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నీ పరిష్కరించి కడపను మోడల్ నగరంగా అభివృద్ధి చేస్తామని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఐఎంఎ హాల్, రవీంద్ర నగర్‌లో రాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపితో టిడిపి పొత్తుపై వైసిపి నేతలు విష ప్రచారం చేస్తున్నారని, జగన్ అసమర్థత పాలనతో అధోగతి పాలైన రాష్ట్ర భవిష్యత్తు కోసమే బిజెపితో పొత్తు అన్నారు. ముస్లిం, మైనార్టీ వ్యతిరేక ఎన్‌ఆర్‌సి బిల్లుకు వైసిపి ఎందుకు మద్దతు తెలిపిందని నిలదీశారు. కడప అసెంబ్లీ టిడిపి అభ్యర్థి మాధవి మాట్లాడుతూ వైసిపికి మరో మారు పొరపాటున ఓటు వేస్తే, మీతో కలిసి తాము తమిళనాడుకు వెళ్లాల్సిందేనని హెచ్చరించారు. కరోనా సమయంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు అలాగే కొనసాగుతున్నాయని, ఇతర రాష్ట్రాలతో, మన రాష్ట్రంలో ఇంధన ధరలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. తెలుగుదేశం హయాంలో దుల్హన్ పథకం ద్వారా రూ.40వేల మంది లబ్ధి పొందారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెన్షన్ పెంపు, వితంతువులకు, ఒంటరి మహిళలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇచ్చేబాధ్యత తనదే అన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్న తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తారన్నారు. అనంతరం అధిక సంఖ్యలో యువత, మహిళలు పార్టీలో చేరగా, వారికి గోవర్ధన్ రెడ్డి, మాధవి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై కొరడా

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై అధికారులు కొరడా ఝుళిపించారు. మోడల్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 194 ఫిర్యాదులు అందగా అందులో 193 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి, వి.విజయ్ రామరాజు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వివిధ ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో వెంటనే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

బంజారా సంప్రదాయ పద్ధతిలో హోలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట స్వామి నాయక్ ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో దాదాపు 700 మంది బంజారాలు పాల్గొని నృత్యాలు చేశారు. ఆదివారం సాంప్రదాయ పద్ధతిలో కట్టెలు వెలిగించి, నవదాన్యాలతో, కుంకుమ రంగుతో, ఆట పాటలతో బంజారా సాంప్రదాయంగా డ్రెస్సులతో ఆనందంగా గడిపి రుచికరమైన విందు తిని రంగులు చల్లుకుని ఆనందంతో గడిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా ఆనంద్ నాయక్, ఠాగూర్ నాయక్, డాక్టర్ శివా నాయక్, వేణు గోపాల్ నాయక్, కృష్ణ నాయక్, శ్రీనివాస్ నాయక్, జగన్ నాయక్, సావిత్రి భాయ్, శకుంతల భాయ్ పాల్గొన్నారు.



బంజార నృత్యం చేస్తున్న మహిళలు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్థానిక మట్టి పెద్దపులివీధిలోని జె కె యూత్ కార్యాలయంలో ఆదివారం 30 మంది పేద మహిళలకు నిత్యావసర సరుకుల రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె కె యూత్ అధినేత లయన్ పఠాన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ దాతల సహకారంతో నిత్యావసర సరుకుల రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. స్తోమత ఉన్న ప్రతి ముస్లిం తనకు తోచిన విధంగా దానధర్మాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సలీం, ఖదీర్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
సోమవారం (సా)	మంగళవారం (ఉ)
6.30	5.05



ఇడుపులపాయలో బస్సు యాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

సిఎం బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుండి చేపట్టే బస్సు యాత్రను విజయవంతం చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇడుపులపాయ నుండి సిఎం జగన్‌రెడ్డి ఈనెల 26 నుండి బస్సు యాత్ర చేపట్టనున్నందున ఆదివారం సాయంత్రం మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని ఆయా ప్రాంతాలను ఎంపీ పరిశీలించారు. పార్టీ నాయకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బస్సు యాత్రకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అందరూ తరలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగనన్న ఓడించేందుకు ఎన్ని పార్టీలు కలిసిన మళ్లీ రెండవసారి ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమంలో బస్సు యాత్ర ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, జెడ్పీటీసీ రవి కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ కవిత భర్త శ్రీనివాసులు, చక్రాయపేట ఎంపిపి మాధవి బాలకృష్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



దువ్వూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - దువ్వూరు

తమ ఆధ్వర్యంలో దువ్వూరు బస్టాండులో చలివేంద్రం ఏర్పాటు చేశామని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ దేవతి ఉపేంద్ర తెలిపారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చలివేంద్రాన్ని దువ్వూరు ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు లింగం పట్టాభిరామయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వూరు ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ఆరవేటి సుబ్బారావు, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వారి సహకారంతో, "స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 10వ తరగతి పరీక్షలు రాసి ఉన్నత చదువుల కోసం ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. పాలిసెట్, ఏపిఆర్‌జెసి ప్రవేశాలకు 14రోజుల్లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం ఈ నెల 28 నుండి ప్రారంభం కానున్నట్లు సేవాసమితి అధ్యక్షులు రాజు ఆదివారం తెలిపారు. ఆ మేరకు కరపత్రాలను ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఎన్‌వి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, శ్రీదేవి, సుబ్బిరెడ్డి, రాజు విడుదల చేశారు. ఆసక్తి గల గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు, వాహనదారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఇసుక రీచ్‌ల్లో ఇసుక కొనుగోలు చేయాలని మైదుకూరు డిఎస్‌పి బి.వెంకటేశులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరియైన బిల్లులు కలిగి ఉండాలన్నారు. అనుమతి లేని ఇసుక రీచ్ నుండి ఇసుక తరలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ గంగాలక్ష్మి

ఆర్యవైశ్యుల అభివృద్ధి వైఎస్ కుటుంబంతోనే..

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆర్యవైశ్యుల అభివృద్ధి వైఎస్ కుటుంబంతోనే సాధ్యమని, రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పులివెందులలో 150 కుటుంబాలకు వాసవి కాలనీ నిర్మాణం దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే రూపుదిద్దుకుందని పులివెందుల రెండో వార్డు మహిళా కౌన్సిలర్ గంగా లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులతో కౌన్సిలర్ గంగా లక్ష్మి మాట్లాడుతూ పులివెందులలో ఆర్యవైశ్యులను ఎలాంటి అవకాశాలు, పదవులు కల్పించలేదంటూ టిడిపి నాయకులు చేసిన విమర్శలపై వారు ఘాటుగా స్పందించారు. ఆర్యవైశ్యులు అన్నిరకాల అభివృద్ధి చెందేందుకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుండి నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వరకు తమ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పులివెందులలో అభివృద్ధి పనులతో తాత్కాలిక ఇబ్బందులు కలిగినా, వాటి ఫలాలను ఆనందిస్తున్నది ఆర్యవైశ్యులేనని వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా సభ్యులు, అనుబంధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కువైట్‌లో గుండాపురం వాసి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని గుండాపురం గ్రామానికి చెందిన బిజివేముల రామచంద్రారెడ్డి (47) బతుకుదెరువు కోసం 2023 అక్టోబర్‌లో జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 16న భవన నిర్మాణ పని చేస్తుండగా పై అంతస్తు నుండి కిందపడి తీవ్రగా గాయపడ్డాడు. అప్పటి నుండి అక్కడే చికిత్స పొందుతూ ఈనెల 21న చికిత్స పొందుతూ హాస్పిటల్లో మృతి చెందాడు. ఆదివారం మృతుని స్వగ్రామమైన గుండాపురానికి బంధుమిత్రుల సాయంతో మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలో ఆదివారం కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బిల్లుల కోసం ఉద్యాన రైతుల నిరీక్షణ



బిల్లుకు నోచుకోని ప్యాక్‌హౌస్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజవర్గంలోని పులివెందుల, ముద్దనూరు డివిజన్‌లో ఉద్యాన రైతులు ఎంతో లక్ష్యంతో ప్యాక్ హౌస్, ఫారం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ముఖ్యంగా దానిమ్మ, చీనీ రైతులకు సంబంధించి ప్యాక్‌హౌస్‌లో కాయలు గ్రేడింగ్, తాత్కాలికంగా నిలువ చేసుకోవడానికి వీలుగా రూ.4 లక్షలు నిధులను ఒక్కొక్క ప్యాక్‌హౌస్‌కు మంజూరు చేయాల్సి ఉంది. ఇందులో రైతు వాటా కింద రూ.2 లక్షలు పోనూ మిగిలిన మరో రూ. 2 లక్షలు ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేయాల్సి ఉంది. పులివెందుల, ముద్దనూరు డివిజన్ పరిధిలో దాదాపు 60 ప్యాక్‌హౌస్ నిర్మాణాలు పూర్తిచేసిన రైతులు బిల్లులు కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్ల నుంచి నిర్మాణాలు పూర్తి చేసి అధికారుల క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినా ఇంతవరకు బిల్లులు మంజూరు కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసుకునే ఫారం పాండ్స్ అవసరమైన రైతులు నిర్మాణాలు చేపట్టారు. దీనికి సంబంధించి బిల్లులు మంజూరు కాలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల కోసం అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప బిల్లులు మంజూరు చేసిన దాఖలాల్లేవని ఉద్యాన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజూరు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు..

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్యాక్‌హౌస్ నిర్మించుకున్నాం. ఇందుకు సంబంధించి అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయి రెండేళ్లయింది. అయినా బిల్లులు నేటికి కూడా మంజూరు కాలేదు. త్వరగా బిల్లు మంజూరు చేయాలని కోరుతున్నాం.

- రాజశేఖర్ రెడ్డి, రైతు, అగ్రహారం

బిల్లులు త్వరలోనే మంజూరయ్యే అవకాశం ..

ప్యాక్‌హౌస్, ఫారం పాండ్స్ నిర్మించిన రైతులకు బిల్లులు మంజూరు కాని విషయం వాస్తవమే. బిల్లులకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి, ముద్దనూరు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాబోయే ఎన్నికల్లో ఒత్తిడి లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో ఆదివారం స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 విద్యార్థులు స్థానిక ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. ఓటు హక్కు పవిత్రమైందన్నారు. పరిపాలన విధానానికి ఆయుధం లాంటిదన్నారు. అందుకే ఎలాంటి ప్రలోభాలకు తలవంచకుండా ఓటు హక్కును వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ విలువైన ఓటును వినియోగించుకోవాలని సూచించారు. వృద్ధులకు బ్యాలెట్ ఓటింగ్, ఓటింగ్ యంత్రాలు, ఓటు వేయు విధానాన్ని వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాడ్ ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్-ఎస్ యూనిట్-2 పిఒ పుల్లయ్య, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు : ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లె గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్



ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సభ్యులు

ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక కార్యక్రమం చివరి రోజులో భాగంగా ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటు అత్యంత విలువైందన్నారు. వచ్చే ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు వేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుభాన్ సాహెబ్ మాట్లాడారు. నెహ్రూ యువ కేంద్రానికి చెందిన శివశంకర్ సతీష్ వారి సేవా బృందం విద్యార్థులతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కళాశాలలో క్యాంప్ ముగింపు సమావేశం నిర్వహించారు. క్యాంప్‌లో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ధ్యాన మందిరం మానసిక ప్రశాంతతనిస్తుంది



శిక్షణ పొందిన వారితో వైఎస్ సునీత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందల పట్టణంలో న్యాక్ బిల్డింగ్ సమీపంలో ఇటీవల కాలంలో విపశ్యన ధ్యాన మందిరం దాదాపు 20 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఆదివారం మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి ఆ ధ్యాన మందిరాన్ని పరిశీలించారు. అనంతరం వారు అక్కడ విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత ఈ స్థలంలో మెడికల్ కళాశాలకు సంబంధించి ఏర్పాటు చేయాలనుకున్నామని, కొన్ని కారణాలవల్ల ఆగిపోవాల్సి వచ్చిందన్నారు. తమ కుటుంబ సభ్యులమంతా గతంలోనే ధ్యాన మందిరం వెళ్లి అక్కడ క్లాసుల్లో కూడా పాల్గొన్నామని, ఆ సమయంలో ఒక ఆలోచన వచ్చిందన్నారు. ఈ సంస్థకు సంబంధించి దీన్ని పులివెందులలో ఏర్పాటు చేయాలని అనుకున్నానని తెలిపారు. వెంటనే ఆ సంస్థ వారితో మాట్లాడి ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఇది చిన్న పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ శిక్షణ ఉచితమేనని తెలిపారు. మగవారికి, ఆడవారికి ప్రత్యేకంగా శిక్షణనిస్తారని తెలిపారు. ముఖ్యంగా పులివెందుల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శిక్షణనిచ్చే గురువులు నందకిషోర్, మస్తాన్ మాట్లాడుతూ దేశంలోనే విపశ్యన ధ్యాన మందిరాలు చాలా ఉన్నాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో మొదటిగా పులివెందులలో ఏర్పాటు చేశారన్నారు. యోగ, ధ్యానం చేయడం వల్ల మానసికంగా ఒత్తిడిని చాలా వరకు తగ్గించుకోవచ్చునని వివరించారు. మరిన్ని వివరాలకు 89850 65050, 89850 65060, 81067 65497 నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

క్షయ వ్యాధిని తరిమికొడదాం..



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

క్షయ (టిబి) వ్యాధిని తరిమి కొడదామని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవ సందర్భంగా ఆదివారం జమ్మలమడుగు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్ రఫిక్ పాషా ఆధ్వర్యంలో క్షయ వ్యాధి అవగాహన, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబిని అంతమొందించడానికి ముందుకు రావాలన్నారు. తగు జాగ్రత్త తీసుకుంటే టిబిని నిర్మూలించవచ్చన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ టిబి పరీక్షతోపాటు హెచ్‌ఐవి పరీక్ష కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఎస్ రవిశంకర్, టీవీహెచ్ వి సునీల, ఎల్‌టి నందకిషోర్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యురాలు స్వాతి సాయి పేర్కొన్నారు.ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయ రోగులకు ఆరు నెలలపాటు ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. కార్యక్రమములో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ వున్నిసా, టిబి సూపర్‌వైజర్ లక్ష్మి తేజ, హెల్త్ సూపర్ వైజర్, సిహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు : అందరూ సమిష్టి కృషితో క్షయ వ్యాధికి ముగింపు పలకాలని డాక్టర్ రాజేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, సూపర్వైజర్స్ సరస్వతి, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఫార్మసి అధికారి సుభాషిణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ పి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ టిబి ఉప కేంద్రం షేక్ హుస్సేన్ బాషా, ఎస్ గంగా శ్రీదేవి క్షయ వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తరుణ్ చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రాజకీయాలకతీతంగా పథకాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే ఎన్నికల్లో వైసిపి ఆశీర్వదించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం గూడెం చెరువు గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించారన్నారు. ప్రతి కుటుంబం వైఎస్ జగన్ పాలనలో ఏదో రకంగా లబ్ధి పొందిందన్నారు. రెండోసారి తనను, జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆగస్టీన్ రాజు, గూడెంచెరువు సర్పంచ్ నాగేశ్వరి, వెంకటరమణ, వైసిపి నేత పాల సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మీ అభిమానం వెలకట్టలేనిది : తనపై ప్రజలు చూపించే అభిమానానికి వెలకట్టలేనని జమ్మలమడుగు శాసనసభ్యులు డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని పి.బొమ్మేపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్త బొడ్డు సోమశేఖర్ పిలుపుమేరకు విందుకు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్‌గా కంటే రాజకీయాల్లో ప్రజల అభిమానం పొందడం చాలా గర్వంగా ఉందన్నారు. ఏ చిన్న కార్యక్రమం జరిగినా ఒక అన్నగా కుటుంబంలో ఒక సభ్యుడిగా భావించి తనను ఆహ్వానించడం చాలా సంతోషం కలిగించిందన్నారు. ఈ ఎన్నికల్లో రెండవ సారి గెలిచి మీ మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటానని సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వరరెడ్డి, బోమ్మేపల్లి సర్పంచ్ గునకనపల్లె రామనాథరెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ముద్రా అమర్‌నాథరెడ్డి, సత్య, బొడ్డుగాళ్ల నడిపి చౌడప్ప, చిన్న చౌడప్ప, గ్రామ వైసీపీ కార్యకర్తలు, వైఎస్ఆర్ కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల ద్వారానే గుర్తింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



బ్రహ్మానందాచారిని సన్మానిస్తున్న అభిమానులు

సేవా కార్యక్రమాల ద్వారానే మంచి గుర్తింపు వస్తుందని, ఆ గుర్తింపు శాశ్వితంగా నిలుస్తుందని మే ఐహెల్ప్ యు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్షణ్ మోరే పేర్కొన్నారు. జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్‌ఎస్ బ్రహ్మానందాచారిని ఆదివారం స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అనాధాశ్రమంలో సన్మానించారు. ఆశ్రమం అధ్యక్షుడు సుబ్బ రాయుడు స్నేహ సేవా సమితి అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సంయుక్తంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోరే మాట్లాడుతూ బ్రహ్మానందాచారి విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నిళ్లు వితరణ చేయడంతోపాటు పక్షులకు సైతం దాహార్తిని తీర్చేందుకు పలు సేవా కార్యక్రమాలు చేస్తుంటారని గుర్తు చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు 1000 పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఎవరికి వారు జీవించడంతోపాటు పక్కవారి క్షేమ సమాచారం గురించి కూడా పట్టించుకోవాలన్నారు. అందుకే మనిషి సంఘజీవిగా గుర్తింపు పొందాడన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చంద్రబాబును సన్మానిస్తున్న మన ప్రజా సేవా సమితి సభ్యులు, నాయకులు

చంద్రబాబును సన్మానించిన మన ప్రజా సేవా సమితి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విజయవాడ ఉండవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వగృహంలో టిడిపి రాష్ట్ర నాయకులు సీఎం సురేష్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి విఎస్ ముక్తియార్ ఆధ్వర్యంలో మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్, ఉపాధ్యక్షులు బిటెక్ బాషా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎండి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ అధికారం వచ్చిన వెంటనే టిడిపి కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవులను వెంటనే ప్రకటించాలన్నారు. మైనార్టీల హక్కులకు భంగం వాటిల్లకుండా భరోసా కల్పించాలని వినతిపత్రం అందించారు. ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి సహాయ కార్యదర్శి రాజేంద్రకుమార్, సభ్యులు ఖాదర్‌బాషా, షరీఫ్, డ్రైవర్ అంజి పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నేత జయరామిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గం వేంపల్లెలో ఉన్న వైసిపి నేత ఎస్‌పి జయరామిరెడ్డి టిడిపిలో చేరారు. శనివారం రాత్రి విజయవాడలోని టిడిపి కార్యాలయంలో పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జయరామిరెడ్డికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. జయరామిరెడ్డి వెంట వెళ్లిన ఆయన సోదరుడు రమేష్‌రెడ్డి, వార్డు మెంబరు వెంకటేష్, దేవస్థానం పాలక మండలి సభ్యుడు హరితోపాటు పలువురికి టిడిపి కండువాలు వేశారు. పులివెందులలో టిడిపి కోసం పని చేయాలని చంద్రబాబు చెప్పినట్లు వారు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, పివి రమణ, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, రామాంజనేయరెడ్డి (చంటి), గొటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

అభివృద్ధి బాబు పాలనలోనే సాధ్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు పాలనలోనే సాధ్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం నగర పంచాయితీ పరిధిలోని 13,14 కౌన్సిల్ వార్డుల్లో ఆమె బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి స్థానిక మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకూ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సూరి, రామసుబ్బయ్య, గంగరాజు, వెంకటేష్, సాంబ, మహీంద్రా, కిషోర్, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ 15 వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ చెంచురామయ్య, మైదుకూరు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, వైసిపి నాయకులు బిపి వేంకట రమణారెడ్డి వారి అనుచర వర్గం ఆదివారం ఎన్‌డిఎ కూటమి మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో ప్రొద్దుటూరు కార్యాలయంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, కటారి కృష్ణ, బిపి సుధాకర్‌రెడ్డి, బిఎన్ శ్రీనివాసులు, పుట్టా ప్రభాకర్, ధనపాల రవి, సుబ్బారెడ్డి, ముడియం ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంగనూరుపల్లిలో 50 కటుంబాలు..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ప్రొద్దుటూరులో తన విజయం తథ్యమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.వరదరాజులరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నంగనూరుపల్లి నుంచి నగేష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వరద పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు టికెట్ రావడానికి ప్రొద్దుటూరు ప్రజలు కారణమన్నారు. ప్రజా మద్దతు తనకే ఉందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అరాచకాలు ఎక్కువయ్యాయని, అందుకోసమే తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామాపురం గురివిరెడ్డి, చౌటపల్లి లక్ష్మిరెడ్డి, బాలుడు, సోములవారిపల్లి సాంబశివుడు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సురభిలో బిటెక్ రవి ప్రచారం

ప్రజాశక్తి - చక్రాయపేట

పులివెందుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీటెక్ రవి మండలంలోని సురభి గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, సురభి ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తుడుమలదిన్నె రాధాకృష్ణయ్య, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి పట్టం అశోక్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, రామాంజనేయరెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షుడు నరసింహులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, పరమేశ్వర, రమేష్, అమర, మండలంలోని మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో పాల సుబ్బారావు, పద్మావతి ఆత్మహత్యలకు కారణమైన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలు చూస్తుంటే ఈ రాష్ట్రంలో సామాన్య పేద ప్రజల భూములకు దిక్కు లేకుండా పోయిందన్నారు. రాబోయే రోజులలో వైసిపి నాయకులు సెంటు భూమి కూడా మిగలకుండా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూ ఆక్రమణకు పాల్పడుతారేమోనని ప్రజలకు సందేహాలు కలుగుతున్నాయన్నారు. సుబ్బారావు తండ్రి చలపతి పేరుతో ఉన్న భూమి తండ్రి మరణానంతరం కుమారునికి చెందక వైసిపి నాయకులకు ఎలా చెందుతుందన్నారు. రెవెన్యూ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రశ్నించారు. ఈ ఆత్మహత్యలకు కారణమైన రెవెన్యూ అధికారులపైన, సహకరించిన వైసిపి నాయకులపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు కోటి రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ప్రజలు ఇకనైనా మేలుకొని ఈ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని కోరారు.

ప్రొద్దుటూరులో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ఎస్‌పి ఉత్తర్వుల మేరకు రానున్న ఎన్నికల సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవడానికి పోలీసులు కవాతు నిర్వహించారు. రాజీవ్ సర్కిల్, ఎర్రన్న కొట్టాలు, భగత్ సింగ్ కాలనీ, ఆచార్ల కాలనీ, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు.